www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 14 | నవంబర్ | 2024 పేజీలు 8

## తలసేమియా నుంచి కోలుకుని గొప్పస్థాయికి ఎదగాలి



-సమాజంలో మన వంతు పది మందికి సాయం అందించాలి
-తలసేమియా చిన్నారులను కలిసిన కలెక్టర్

2లో

# ముమ్మరంగా సిపిఐ సభ్యత్వ చేర్పింపు

- గ్రామ గ్రామాన శాఖల ఏర్పాటే లక్ష్యం
- గ్రామాలలో సిపిఐ నేతల విస్తృత పర్యటన
- డిసెంబర్ నుంచి ఏడాది పొడవునా వందేళ్ల సంబురం





(ఫైల్)

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్రలో 1924 డిసెంబర్ 26 నుంచి 1925 డిసెంబర్ 25 వరకు చిరస్థాయిగా నిలిచి పోనుంది. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి డిసెంబర్ 26 నుంచి వందో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఈ శత సంవత్సర ఉత్సవాలను వాడ వాడలా ఘనంగా నిర్వహించడంతో

మిగతా 2లో..

## ముక్కలుగా నరికి.. మూటకట్టి



-ఆర్థిక వ్యవహారంలో మహిళ దారుణ హత్య
-దంపతుల ఆత్మహత్యకు కారకులుగా ఉన్న నిందితుడు

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** ఆర్థిక వ్యవహారాలు శృతి మించితే ఏ పరిస్థితికైనా దారితీస్తాయనడానికి ఈ ఘటన ఓ ప్రత్యక్ష ఉదాహరణ. ప్రియురాలు కావడం దానికి తోడు వీరిద్దరి నిర్వాకం కారణంగా దంపతులు ఆత్మహత్య చేసుకోవడం తదనంతర పరిణామాలు హత్యకు దారితీసినట్లుగా తెలుస్తుంది. మొత్తానికి మహిళను 20 ముక్కలుగా నరికి గోనె సంచిలో కట్టి పంట పొలంలో పాతిపెట్టిన సంచలన ఘటన భద్రాద్రి కొత్తగూడెంజిల్లా జూలూరుపాడు మండలంలో చోటు చేసుకుంది. జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన వీరభద్రం గతంలో ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేసినప్పుడు స్వాతి అనే యువతితో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. అప్పటికే వీరభద్రానికి జూలూరుపాడు మండలంలోని మాచినపేటకు చెందిన యువతీతో వివాహం జరిగింది. అయినా

మిగతా 2లో..

## సర్వేకు స్పందన అంతంత మాత్రమే



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజల నుంచి అంతంత మాత్రంగానే స్పందన లభిస్తుంది. మొత్తం సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే పట్ల ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీని వెనక రకరకాల కారణాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతుంది. కుల గణనతో పాటు ఆర్థిక, రాజకీయ, సామాజిక విషయాలను తెలుసుకునేందుకు ఈ సర్వే చేపట్టారని

### ఆసక్తి చూపని ప్రజలు

ప్రభుత్వం చెపుతున్న ఎందుకో ప్రజలు సర్వే అధికారులకు అంతగా సహకరించడం లేదు. పైగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోకపోతే ఏమవుతుందన్న ఒక ఎదురు ప్రశ్న పలు చోట్ల వినవస్తుంది. గతంలో కేసిఆర్ చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే ప్రభావం కూడా ఈ సర్వేపై

మిగతా 2లో..

# ముమ్మరంగా సిపిఐ సభ్యత్వ చేర్పింపు

(మొదటిపేజీ తరువాయి)

పాటు పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులనుచేస్తూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణను రూపొందించుకునేందుకు కమ్యూనిస్టు పార్టీ సిద్ధమవుతుంది. ఇందులో తొలి దశలో భాగంగా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ దినోత్సవం (నవంబర్ ఏడున) చేపట్టాయి. ఖమ్మం జిల్లాలో పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు ప్రారంభించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీనియర్ సభ్యులకు సభ్యత్వాన్ని అందజేయడం ద్వారా ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో ఎన్నడులేని విధంగా ప్రజల నుంచి విపరీతమైన స్పందన లభించింది.భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పండుగలో నేను పాలు పంచుకోవాలన్న ఉత్సాహం కమ్యూనిస్టు పార్టీ భావాజాలం కలిగిన వారిలో కనపడుతుంది. సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీలో కొనసాగిన వేలాది మంది ఈ పండుగ వేళ పార్టీ సభ్యత్వాన్ని పొందెందుకు నాయకులకు ఫోన్లు చేసి మా గ్రామానికి రావాలంటూ కోరుతుండడం గమనార్హం. ఈ వందేళ్ల ఉత్సవానికి కార్యాచరణ రూపొందించిన జిల్లా సమితి జిల్లా నాయకత్వాన్ని ఆయా గ్రామాలకు ఇంచార్జిలుగా నియమించింది. ఖమ్మంజిల్లాలోని అన్ని మండల శాఖలతో పాటు ఉద్యమ ప్రభావం కలిగిన గతంలో ఉద్యమంలో పాల్గొన్న కుటుంబాల నుంచి సభ్యత్వం స్వీకరించడం ద్వారా గ్రామ గ్రామాన కమ్యూనిస్టు పార్టీ శాఖలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, రాష్ట్ర నాయకులు, రాష్ట్ర సమితి సభ్యులు గ్రామాల వారీగా పర్యటిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. సభ్యత్వ కార్యక్రమం పూర్తి కాగానే యువజన విద్యార్థి, మహిళా రైతు, వ్యవసాయ కార్మిక సంఘం మొదలైన ప్రజా సంఘాల మహాసభలు నిర్వహించాలని నిర్ణయించారు. తొలి దశలో రాష్ట్ర స్థాయి జన సేవా దళ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం జిల్లా, మండల స్థాయిలో జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేసి రెండు వేల మంది జన సేవాదళ్ వాలంటీర్లను తయారు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. మారుతున్న ప్రజల జీవన విధానాలు, పాలకుల నిర్ణయాలు, మతోన్మాదం, రైతాంగ పరిస్థితి, వ్యవసాయ రంగ సంక్షోభం తదితర అంశాలకు సంబంధించి కళా రూపాలను రూపొందించి ప్రజల్లోకి తీసుకు పోయేందుకు ప్రజానాట్య మండలి శిక్షణా శిబిరాలను నిర్వహించాలని కార్యాచరణ తీసుకున్నారు. డిసెంబర్ 26న వందేళ్ల సంబుర ప్రారంభ సందర్భంగా ఖమ్మంలో వేలాది మందితో ప్రదర్శన నిర్వహించనున్నారు. కవులు, కళాకారులు, యువజన విద్యార్థులతో ప్రత్యేక ప్రదర్శన చేపట్టనున్నట్లు జిల్లా సమితి తెలిపింది. డిసెంబర్ 30న వందేళ్ల ఉత్సవాల సందర్భంగా నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి బహిరంగ సభ తర్వాత జిల్లాలో వందేళ్ల ఉత్సవాలకు సంకేతంగా బహిరంగ సభను నిర్వహించనున్నారు. మొత్తంగా వందేళ్ల సంబురం కమ్యూనిస్టు శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది.

# తలసేమియా నుంచి కోలుకుని గొప్పస్థాయికి ఎదగాలి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తలసేమియా నుంచి కోలుకుని పిల్లలు గొప్ప స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సమాజంలో మన వంతు పది మందికి సాయం అందించాలని కలెక్టర్ సూచించారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వైరా రోడ్డులోని రితన్య ఆసుపత్రిలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బాలల దినోత్సవంలో పాల్గొని తలసేమియా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ కుటుంబంలో వచ్చిన బాధ ఇతరులకు రావద్దని గొప్ప ఆలోచన, మంచి మనస్సుతో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసిన ఫౌండర్‌ను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ ప్రయాణంలో అనేక మందికి సాయం అందించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో జరుగుతున్న మంచి కార్యక్రమాలు విస్తృతంగా అమలు చేయాలంటే మీడియా సహకారం కూడా చాలా అవసరమన్నారు. సంకల్ప సంస్థ ఫౌండర్ అనిత, డాక్టర్ డి. నారాయణమూర్తి లను ఆదర్శంగా తీసుకుంటూ సమాజంలో పది మందికి సాయపడేవిధంగా పిల్లలు ఎదగాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలు జంక్ ఫుడ్, చాక్లెట్లు వంటివి తినడం తగ్గించాలని మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సదరం క్యాంపు నుంచి సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్న కలెక్టరేట్‌కు వచ్చి తెలియజేయాలని వాటి పరిష్కారానికి అవసరమైన సహాయ సహకరాలను అందిస్తామని తెలిపారు. సంకల్ప సంస్థ ఫౌండర్ అనిత మాట్లాడుతూ 2009లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించామని ప్రతి నెల 220 మంది పిల్లలకు అవసరమైన మందులు, ఇతర సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. తలసేమియా వ్యాధి ఎలా వస్తుందనే అంశంపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ ద్వారా ఏడువేల మందికి పైగా విద్యార్థులకు తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించామన్నారు. 12 మంది పిల్లలకు బోన్‌మ్యారో ఆపరేషన్ చేయించామన్నారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ విజయం సాధించడంలో మీడియా మంచి సహకారం అందించిందన్నారు. డాక్టర్ నారాయణమూర్తి మాట్లాడుతూ సంకల్ప స్వచ్ఛంద సంస్థకు కలెక్టర్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడే చిన్న పిల్లలకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ రావడం లేదని దీనిని పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. సంస్థ ద్వారా సేవలు అందిస్తున్న ఫౌండర్ అనిత, పావనిలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మాధవరావు, సభ్యులు రవిచందర్, పావని తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

**-ఐఎన్‌టీయూసి ఆధ్వర్యంలో యాజమాన్యానికి వినతి**



ప్రజాపక్షం/సత్తుపల్లి : సింగరేణి ఉద్యోగులు పలు సమస్యలతో సతమతమవుతున్నారని తక్షణమే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసి యూనియన్ ఆధ్వర్యంలో యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు నాయకులు.బుధవారం స్థానిక జేవిఆర్ సిహెచ్‌పి మైన్‌లో ఐఎన్‌టీయూసి ఫిట్ సెక్రెటరీ పోగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిదులుగా కొత్తగూడెం రిజియన్ జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్‌లు పాల్గొన్నారు.అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కొత్తగూడెం ఏరియా గెలుపుకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడు కార్మికుల సంక్షేమ కోసం యాజమాన్యంతో ప్రతి సమస్యపై చర్చిస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసి యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలంగాణ మినిమం వేజెస్ అడ్వైజరి బోర్డ్ చైర్మన్ కార్మికుల పలు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ,సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తున్నారని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ,కోల్ బెల్ట్ ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో గత ఆర్థిక సంవత్సరం సంబందించిన లాభాల వాటా 33శాతం ఇప్పించటం జరిగిందని,అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5వేల ఇప్పించటం జరిగిందన్నారు.జేవిఆర్ సిహెచ్‌పిలో సుదీర్ఘకాలంగా ఉద్యోగుల పలు సమస్యలు పెండిగ్ లో ఉన్నాయని ,ముఖ్యంగా ఐ.ఈ.డి నార్మ్స్ ప్రకారం మ్యాన్ పవర్ సర్దుబాటు చేయాలని ,సైలో బంకర్‌లో లిఫ్ట్ ,క్యాంటిన్ అదునీకరణ,డస్ట్ అలవెన్స్,స్పెషల్ ఇన్సెంటివ్,ఓపెన్ స్టేజీ తదితర మౌలిక వసతులు వెంటనే సమకూర్చాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసి బ్రాంచ్ నాయకులు గౌస్, బట్టి విక్రమార్క,తీగల క్రాంతి కుమార్,సీతా రామరాజు, రిషికుమార్, ఫిట్ సెక్రెటరీలు రామారావు, బాలాజీ, నవీన్, రమేష్, చంద్రశేఖర్, అడపు రవి,రవీందర్, మోహన్‌లాల్, జాను తదితరులు పాల్గొన్నారు.

# సర్వేకు స్పందన అంతంత మాత్రమే

(మొదటిపేజీ తరువాయి)

పడుతుంది. గత ప్రభుత్వం అట్టహాసంగా సర్వేను చేపట్టింది. ఈ సర్వే తర్వాత పలు మార్పులు చోటు చేసుకుంటాయని ఇంకా ఏదేదో కబుర్లు చెప్పడంతో ఎక్కడెక్కడో జీవిస్తున్న వారంతా స్వగ్రామాలకు చేరుకుని సర్వేకు పూర్తిగా సహకరించారు. అయినా సర్వే కారణంగా తమకు ఒరిగింది ఏమి లేదని ఇది కూడా అటువంటి సర్వే అన్న భావన ప్రజల్లో నెలకొంది. ఇక కొందరిలో ఉన్న రేషన్ కార్డులు పోతాయని, పింఛన్లు పోతాయని వీటిని తీసి వేయడం కోసమేసర్వేను చేపట్టారని ప్రచారం జరుగుతుండగా ఈ ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులు తెలుసుకునేందుకే అని చెప్పినప్పటికీ ప్రజలు అంతగా పట్టించుకోవడం లేదు. సర్వేకు సంబంధించి 75 ప్రశ్నలు ఉండడం వీటిలో కొంత వ్యక్తిగత సమాచారాన్ని తెలపాల్సి రావడం కూడా ప్రజల అయిష్టతకు కారణమవుతుంది. సర్వేపై ప్రభుత్వం అధికారులకు, ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చినప్పటికీ ప్రజల్లో అవగాహన కల్పించడంలో కొంత లోపం కనపడుతుందన్న విమర్శలు వినవస్తున్నాయి. జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు గ్రామాలకు వెళ్లి తరచూ సర్వేను పర్యవేక్షిస్తుండడం, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తుండడంతో కొంత మార్పు కనపడుతుందని సర్వేలో పాల్గొంటున్న అధికారులు, ఉపాధ్యాయులు అంటున్నారు. కొన్నిచోట్ల సర్వేకు సంబంధించిన మెటీరియల్ అందడం లేదని అక్కడక్కడ విమర్శలు వినవచ్చాయి. 13వ తేదీ నాటికి జిల్లాలో మొత్తం 565998 కుటుంబాలు ఉండగా దాదాపు ఖమ్మం నగరంతో సహా మున్సిపాలిటీలు, అన్ని మండలాల్లోను సర్వే ప్రారంభమైంది. ఈనెల 13వ తేదీ నాటికి 1,14,493 ఇండ్లకు సంబంధించి సర్వేపూర్తయిందని అధికార యంత్రాంగం తెలిపింది. 20.23 శాతం పూర్తయింది.

# ముక్కలుగా నరికి.. మూటకట్టి

(మొదటిపేజీ తరువాయి)

స్వాతి, వీరభద్రం కలిసి తిరుగుతున్నారు. ఈ క్రమంలో వీరిద్దరు కలిసి జూలూరుపాడు మండలంకు చెందిన పార్వతి రత్నకుమార్ అనే దంపతుల వద్ద సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తామని రూ. 16 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగంపై ఆశతో అప్పు తెచ్చి రూ. 16 లక్షలు చెల్లించిన ఆ దంపతులు ఉద్యోగం రాకపోవడం, వడ్డీలు భారం కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. ఆ సమయంలో పెద్ద మనుషుల సమక్షంలో డబ్బు చెల్లింపు పంచాయతీ జరిగింది. స్వాతి ఆ డబ్బును చెల్లించేందుకు అంగీకరించినట్లు ప్రచారం జరిగింది. అప్పటి నుండి స్వాతి డబ్బు చెల్లింపు కోసం వీరభద్రంపై ఒత్తిడి పెంచింది. కొద్ది రోజుల క్రితం వీరభద్రం ఇంటికెళ్లి డబ్బుల విషయమై గోడవ చేసినట్లు సమాచారం. డబ్బుల వ్యవహారంలో తనను ఇరికించడమే కాకుండా డబ్బులు చెల్లించాలని పట్టుబడుతున్న స్వాతిని వదిలించుకోవాలని భావించిన వీరభద్రం స్వాతిని రప్పించి కుటుంబ సభ్యుల సాయంతో హతమార్చాడు. ఆ తర్వాత ఆమెను తీసుకెళ్లి సుమారు 20 ముక్కలుగా నరికి గోనె సంచిలో పెట్టి దగ్గరలోని పంట పొలంలో పాతిపెట్టాడు. ఈలోపు పోలీసులకు స్వాతి మిస్సయినట్లు ఫిర్యాదు రావడంతో దర్యాప్తు చేపట్టారు. అనుమానంతో వీరభద్రంను అదుపులోకి తీసుకోగా అసలు కథ బయటకు వచ్చింది. బుధవారం ఉదయం కొత్తగూడెం డిఎస్‌పి అబ్దుల్ రెహ్మాన్, జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణాప్రతాప్ తదితరులు వీరభద్రంను తీసుకుని వీరభద్రం సూచించిన స్థలం వద్దకు చేరుకున్నారు. తహసీల్దార్ బిందు సమక్షంలో స్వాతి మృతదేహాన్ని వెలికితీసి పంచనామ నిర్వహించారు. వారు వసూలు చేసిన రూ. 16లక్షల ఆర్థిక ఆరోపణల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు సమాచారం. మహిళను ముక్కలుగా నరికి పాతిపెట్టడం ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. ప్రస్తుతం వీరభద్రం పోలీసుల అదుపులో ఉన్నాడు.

# బీసీ ఐక్య వేదిక సదస్సు విజయవంతం



ప్రజాపక్షం/మణుగూరు రూరల్: బిసి ఐక్యవేదిక సదస్సు మణుగూరు పద్మశాలి మండపంలో బుధవారం 20 మంది వివిధ కులాలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాత్కాలిక కమిటీ అడహక్ కమిటీ ని ఎన్నుకున్నట్లు బిసి ఐక్యవేదిక ఒక ప్రకటనలో తెలిపారు. బిసి ఐక్య వేదిక సదస్సుకు పట్టణంలోని నలుమూలల నుండి ఇరవై వివిధ కులాలకు చెందిన వారు పాల్గొనడం విశేషం. హాజరైన వారిలో డాక్టర్ సమ్మయ్య, వలసాల రామారావు, జి వెంకటేశ్వర్లు, సోమేశ్వర్ గౌడ్ లు ఉన్నారు. సమావేశంలో ముగ్గురితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వీరిలో కన్వీనర్‌గా వీరంకి వెంకట్రావు గౌడ్, కో కన్వీనర్‌గా శ్రీరాముల పెద్దులు, నాగారపు సతీష్‌తో పాటు 20 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని బిసి ఐక్యవేదిక సదస్సు తెలిపింది. ఈ సందర్భంగా బీసీ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాలు మారుతున్న వెనుక బడిన కులాల జీవితాలు ఎప్పుడు వెనుకబడ్డట్టే ఉంటున్నాయని, ఓట్లు మనవి సీట్లు వారివి అన్న చందంగా తయారైందని అన్నారు. వెనుకబడ్డ బీసీ కుల సంఘాలు ఐక్యతతో ముందుకు సాగితే రాబోయే రోజుల్లో బీసీ రాజ్యం, రాజ్యాధికారం ఏర్పాటు చేసుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. మన ఓట్లతో గెలిచిన నాయకులు గద్దెనెక్కి మనల్ని అడుక్కునే విధంగా తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మనమంతా కలిసి ఒకే తాటిపై నిలబడి బీసీల రాజ్యాధికారం కోసం ప్రాణాలైనా అర్పించే విధంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, గాండ్ల సురేష్, మాజీ సర్పంచ్ కంప రవి, న్యాయవాది రుద్ర వెంకట్, కృష్ణ, పున్నం బిక్షపతి, చంద్రమౌళి, సంపత్, సతీష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి




## టిజిపిఎస్‌సి ఛైర్మన్ మహేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నవంబర్ 17, 18 తేదీల్లో చేపట్టే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి పరీక్షల నిర్వహణను విజయవంతం చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఎం. మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్ 3 పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ అన్ని దశల్లో ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూము ఏర్పాటు పటిష్టంగా చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను శాఖాధికారి, సంబంధిత పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్‌తో సమన్వయం చేసుకుని ముందస్తుగా ఏర్పాట్లు చేయాలన్నారు. త్రాగు నీటి వసతి, శానిటేషన్ చేపట్టాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ తప్ప మరెవ్వరికి మొబైల్ ఫోన్ పరీక్షా కేంద్రంలోని అనుమతి లేదన్నారు. మొబైల్ ఫోన్, పుస్తకాలు, అనుమతి లేని సామాగ్రిని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి కేంద్రంలోకి రాకుండా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడ సమస్యలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని , అబ్జర్వర్, రూట్ అధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్, శాఖాధికారి, చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు అన్ని స్థాయిల వారికి పరీక్ష నిర్వహణ విషయమై తగు శిక్షణనిచ్చి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు సజావుగా పూర్తి చేయాలని ఛైర్మన్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో 27,984 మంది గ్రూప్ 3 పరీక్షలు రాయనున్నారని వారి కోసం 87 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పరీక్షా కేంద్రాలలో నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దు



## డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజలకు ఆరోగ్య, వైద్య సేవలు అందించే క్రమంలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. బుధవారం ఖమ్మంలోని మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌ను డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి సందర్శించారు. అక్కడ అమలవుతున్న ఆరోగ్య సేవలను, ఫార్మసీ, ల్యాబ్, వ్యాక్సిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే క్రమంలో నిర్లక్ష్యం వహించరాదని, రోగుల పట్ల అప్యాయతతో ఉంటూ సరైన పరీక్షలు, చికిత్సలు అందించాలన్నారు. మాతా శిశు సంక్షేమం, అసంక్రమణ వ్యాధులు నియంత్రించే కార్యక్రమం, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాలు అమలు చేయాలని తెలిపారు. ప్రజలకు అందించిన సేవలను ఎప్పటికప్పుడు హెచ్ఎంఐఎస్ మందు అప్‌డేట్ చేయాలని ఆమె తెలిపారు. అనంతరం ఏదులాపురం హెల్త్ సబ్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాన్ని డిఎంఅండ్‌హెచ్‌వో సందర్శించారు. అక్కడ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ మెయింటెన్ చూశారు. ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, పిల్లలకు అందిస్తున్న డైట్‌ను పరిశీలించారు. పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని వారికి అందిస్తున్న డైట్, గర్భిణీ స్త్రీల ఆరోగ్యం గురించి స్థానిక ఏఎన్ఎంల సహకారం తీసుకుని సేవలు అందించాలని ఆమె తెలిపారు.

# చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులు అరెస్టు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రఘునాథపాలెం సిఐ మహ్మద్ ఉస్మాన్ షరీఫ్ బుధవారం తెలిపారు. సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో రఘునాథపాలెం గ్రామం యాపిల్ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ఆటో, ఒక మోటార్ సైకిల్‌పై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తూ పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించగా వారిని వెంబడించి పట్టుకుని విచారించినట్లు సిఐ తెలిపారు. ఖమ్మం ఖానాపురంకు చెందిన వడ్లకొండ శివ, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బెల్లి సందీప్, ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన రాపర్తి బాబ్జీ ఖమ్మం యుపిహెచ్ కాలనీలో ఉంటున్నట్లు గుర్తించామన్నారు. వీరు ఖమ్మంజిల్లాలోని తల్లాడ మండలం నందు, హైదరాబాద్‌లోని మియాపూర్ ఏరియా నందు, కూసుమంచి మండలం, కోహెడ మండలం, నేలకొండపల్లి మండలం, వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి ఏరియా, రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి గ్రామం నందు, ఖమ్మం రూరల్ మండలంలోని కాచిరాజుగూడెం గ్రామంలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. వారి వద్ద నుంచి 21 తులాల వెండి పట్టీలు, అర తులం బంగారం చెవిదిద్దులు, ఒక ఆటో, మోటార్ సైకిల్‌ను స్వాధీన పర్చుకున్నట్లు సిఐ తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

# శ్రీరక్షలో ఉచిత ఫైబ్రో స్కాన్ క్యాంపు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని శ్రీరక్ష ఆసుపత్రిలో ఉచిత ఫైబ్రో స్కానింగ్ క్యాంపును నిర్వహించారు. బుధవారం జైడస్ లైఫ్ సైన్సెస్ సహకారంతో అత్యాధునిక ఫైబ్రో స్కాన్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపు ద్వారా కాలేయం (లివర్) సంబంధిత సమస్యలు, లివర్ డ్యామేజిని గుర్తించడానికి అనువుగా ఫైబ్రో స్కాన్ పరీక్షలను ఉచితంగా అందించారు. 500 మందికి ఈ క్యాంపులో ఉచితంగా స్కానింగ్ నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజలు లివర్ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్న తగిన చికిత్సలు తీసుకునే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ ఏడుకొండలు, డాక్టర్ కాశీవిశ్వనాథ్, డాక్టర్ కన్నెటి సతీష్ పాల్గొన్నారు.

# గుండెపోటుతో సిపిఐ సీనియర్ సభ్యురాలు మృతి

## - నివాళులర్పించిన జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం కామంచికల్లు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ సానుభూతిపరురాలు బొప్పి ముత్తమ్మ(65) గుండెపోటుతో బుధవారం ఇంటివద్ద మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పోటు ప్రసాద్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు శోభన్‌బాబు ప్రస్తుతం సిపిఐ జనసేవదళ్ సభ్యుడిగా పనిచేస్తుండగా.. కుటుంబం సభ్యులుగా కొనసాగుతుంది. నివాళులర్పించిన వారిలో జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి బొప్పి గాంధీ, బొప్పి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆర్టిసి లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల్లో లక్కీ డ్రా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బుధవారం ఖమ్మం న్యూబస్టాండ్ నందు జరిగిన కార్యక్రమంలో ఆగస్టు, సెప్టెంబరు నెలలో ఖమ్మం రీజియన్ పరిధిలో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు లక్కీ డ్రా నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా రీజినల్ మేనేజర్ సరిరాం ముఖ్య అతిథిగా పాల్గొని 48 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ప్రత్యేకంగా లక్కీ డ్రా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా ప్రయాణికులు మాట్లాడుతూ ఆర్టిసి అంటే మహిళలకు చాలా నమ్మకం అని అర్ధరాత్రి కూడా క్షేమంగా, సురక్షితంగా మహిళా ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చే సంస్థ ఆర్టిసి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా డిప్యూటీ రీజినల్ మేనేజర్ జివన్ పవిత్ర, ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా సిపిఐ సభ్యత్వాల సేకరణ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ(సి.పి.ఐ) శత వార్షికోత్సవాల సందర్భంగా సభ్యత్వ పునరుద్ధరన కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలంలో ముమ్మరంగా సాగుతుంది. ఇందులో భాగంగా బుధవారం పొన్నెకల్లు గ్రామంలో పార్టీ సభ్యులు నుంచి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ సభ్యత్వాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...తాడిత, పీడిత ప్రజలపక్షాన అండగా నిలుస్తున్న సిపిఐ పార్టీలో సభ్యునిగా కొనసాగడం ఎంతో అజరామరమైన ఘట్టంగా పేర్కొన్నారు. బూర్జ్వా పార్టీలో సభ్యత్వాలు వ్యాపార ధోరణిలో లాభాపేక్షగా ఉంటాయన్నారు. కానీ కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం సమాజంలో ఉన్నతికి దోహదం చేస్తాయన్నారు. కావున సిపిఐ పార్టీ సభ్యులుగా చేరాల్సిందిగా లౌకిక వాదులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తేలపూడి కిషన్‌రావు, రాము, నరేష్, కోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



ప్రజాపక్షం/కొణిజర్ల : విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని బిగ్ హెల్ప్ సంస్థ చైర్మన్ షేక్ చాంద్‌పాషా అన్నారు. మండల పరిధిలోని సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థవారి సహాయంతో కళావేదికను నిర్మించారు. కళావేదికను బిగ్‌హెల్ప్ సంస్థ ఫౌండర్ , చైర్మన్ షేక్ చాంద్‌పాషా బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ , మండల విద్యాశాఖాధికారి అబ్రహాం , ఉపాధ్యాయిని , ఉపాధ్యాయులు , ప్రాజెక్ట్ డైరెక్టర్ రామానుజాచార్యులు , విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణపతి ఆలయ నిర్మాణానికి రూ. 50వేల విరాళం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని రామన్నపేట మారుతీనగర్‌లో స్వయంభూ శ్రీ విజయ గణపతి మందిర నిర్మాణానికి కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ రూ. 50వేల విరాళాన్ని అందజేశారు. బుధవారం ఆలయ శంకుస్థాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని కొప్పుల చంద్రశేఖర్ కమిటీ బాధ్యులకు రూ. 50వేల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, నిరంజన్, నాయకులు నరేష్, సుధీర్, శ్రీనివాసరావు, వాస్తు సిద్ధాంతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 15న దేవాలయంలో చండీహోమం



ప్రజాపక్షం/పాల్వంచ టౌన్: పాల్వంచ మండలంలోని కేశవాపురం, జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి) నందు పౌర్ణమి సందర్భంగా ఈనెల 15 శుక్రవారం రోజున చండీ హోమం జరుగుతుందని కార్యనిర్వహణాధికారి ఎన్ రజనీకుమార్ తెలిపారు. ఈ చండీ హోమం జరిపించుకున్న భక్తులకు అమ్మవారు ఆయురారోగ్య, అష్టైశ్వర్యములు , ఆర్థిక బాధలు తొలగి, సుఖ సంతోషాలతో వర్థిల్లుతాకని వేదాలు చెబుతున్నట్లు తెలిపారు. ఈ చండీ హోమంలో పాల్గొను భక్తులు ముందుగా గాని అదే రోజు గాని రూ 2516 చెల్లించి టికెట్ పొంది, మీ గోత్రనామములు నమోదు చేసుకోవాలన్నారు. చండీహోమంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్ర ప్రసాదమలతో పాటు ఉచిత అన్నప్రసాదం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లేని వారి పేర సంకల్పం చేసి హోమం చేయబడుతుందని, హోమంలో పాల్గొను భక్తులు సాంప్రదాయ దుస్తులు అనగా మగవారు ధోతి, కండువాను ధరించి, ఆడవారు చీర ధరలించాలన్నారు. పూర్తి వివరాలను ఫోన్ నెంబర్ 6303408458ను సంప్రదించాలని కోరారు.

## లక్ష్య సాధనకు ధైర్యమే సాహసంగా ముందు సాగాలి



ప్రజాపక్షం/పాల్వంచ: లక్ష్య సాధనకు ధైర్యమే సాహసంగా ముందు సాగాలని అంతర్జాతీయ విమానాశ్రమ శంషాబాద్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంగవాత్ వెంకన్న అన్నారు. బుధవారం పాల్వంచ మండలంలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని, ఏజిహెచ్ఎస్ ఉల్వానూరు నందు ఆఆయన హాజరై విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో భయమున్నప్పుడు ఏది సాధించలేమని, లక్ష్యసాధనకు ధైర్యమే సాహసంగా ముందు సాగాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడు మృతికి అధికారులే కారణం




ప్రజాపక్షం/ములకలపల్లి: ఈనెల 12వ తారీఖున జూలురుపాడు మండలం చిన్న తండా గ్రామ పంచాయితీ కార్మికుడు బానోత్ తరుణ్ విధులలో భాగంగా వీధి లైట్లు పెడుతూ ఉంటూ 11 కెవి కింద ఉన్న టేకుచెట్టును కొడుతుండగా ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్‌కు గురి అయ్యి మంగళవారం మృతి చెందడం జరిగింది. అధికారులు మల్టీ పర్పస్ పేరుతో అన్ని రకాల పనులు అనుభవం లేని వారి చేత చేయించడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఏఐటియూసి మండల ఉపాధ్యక్షులు గద్దల మహేష్ అన్నారు. వీధి లైట్లు పెట్టాలంటే ఎలక్ట్రిషన్ చేసి ఉండాలి, ట్రాక్టర్ డ్రైవింగ్ చేయాలంటే లైసెన్స్ ఉండాలని ఇవన్నీ ఏమీ లేకుండా మల్టీ పర్పస్ పేరుతో అన్ని రకాల పనులు కార్మికుల చేత చేయించడం వలన ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో మండలంలో కూడా ఒక కార్మికుడు ఇలాగే చనిపోయాడని కనీసం ఇంత వరకు ఎటువంటి నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఈ కార్మికుడికి రూ 10లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మండలంలో అన్ని గ్రామ పంచాయితీ కార్మికులు విధులు బహిష్కరించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. నల్ల రిబ్బన్లతో నిరసన తెలియజేయాలని ఎన్ జగన్నాధపురం పంచాయితీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో తెలిపారు. ముందు ముందు ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుని అనుభవం నైపుణ్యం ఉన్న వారి చేతనే పనులు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కారోబర్ రామ్ సురేష్, పొట్టి చిన్నయ్య, కనక సత్యం, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాదారం మార్కెట్ యార్డ్ నందు ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలులో భాగంగా ములకలపల్లి సంఘం అధ్యక్షురాలు నడిపల్లి సునంద ఆధ్వర్యంలో నేడు మాదారం మార్కెట్ యార్డ్ నందు అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఈ ధాన్యం కొనుగోలును రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సెక్రటరీ కుంచారపు శ్రీనివాసరావు అన్నారు.

# అప్‌గ్రేడైనా ఆయాలేరీ..!

**-మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన రాష్ట్రప్రభుత్వం**
**-ఈ ఏడాది జనవరిలోనే జారీ అయిన ఉత్తర్వులు**
**-జిల్లాలో మొత్తం 605 మంది ఆయాల అవసరం**
**-ఇప్పటికీ నోటిఫికేషన్ జారీ చేయని వైనం**



ప్రజాపక్షం-చింతకాని : మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన మినీ కేంద్రాల్లో ఆయాలను నియమించకపోవడంతో కార్యకర్తలే అన్ని పనులు చేయాల్సి వస్తోంది. జిల్లాలో ఉన్న 220 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ గత జనవరిలోనే స్త్రీ,శిశు సంక్షమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.అప్పట్లోనే ఆయాలను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉండగా నేటి వరకు ఆయాల నియామకాలకి చర్యలు తీసుకోకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు.ఎప్పుడైనా అంగన్‌వాడీ కార్యకర్తలు సెలవులో వెళ్తే గర్భిణులు ,బాలింత,చిన్నారులకు పౌష్టికాహారం అందించేవారు ఉండటం లేదు.తాజాగా సమగ్ర సర్వేకు కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలను వినియోగిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఆయాల అవసరం ఎంతో ఉంది. ఆయాలు ఉన్నచోట ఎలాంటి ఇబ్బందులు లేనప్పటికీ ఆయాలు లేని చోట కార్యకర్తలే పౌష్టికాహారం వండి పెడుతున్నారు.ఇదిలా ఉండగా ఆయాల పోస్టులను భర్తీ చేస్తే కొంత మంది మహిళలకైనా ఉపాధి లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**ఖమ్మం జిల్లావ్యాప్తంగా 605 మంది ఆయాల అవసరం**

అంగన్‌వాడీ వ్యవస్థలోనూ 65 ఏళ్ల వయస్సు నిండిన వారితో పదవీ విరమణ చేయాంచారు. ఈనేపథ్యంలో జిల్లాలో 385 మంది పదవీ విరమణ చేయగా 220 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడంతో మొత్తం 605 మంది ఆయాల పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి.రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ఆదేశాలు లేవు.. కె రాంగోపాల్‌రెడ్డి(జిల్లా స్త్రీ ,శిశు సంక్షేమశాఖ అధికారి)**


అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల నియామకంపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు.పదవీ విరమణ కారణంగా చాలా చోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే ఆయాల నియామకం పూర్తిచేస్తాం.

**ఆయాల నియామకం తక్షణమే చేపట్టాలి... (తోట రామాంజనేయులు ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి )**

జిల్లా వ్యాప్తంగా 605 మంది అంగన్‌వాడీ ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆయాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి నియామకం చేపట్టాలి. అలాగే చాలా చోట్ల అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్ఓ విధులు అప్పగించారు. వారికి బీఎల్ఓల విధులు అదనంగా ఉండటంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారిని బిఎల్ఓ విధులనుంచి తప్పించాలి.

# కారేపల్లి మండలంలో కల్తీ మద్యం అమ్మకాలు..!

**-మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటం**
**-మద్యం దందాపై పట్టింపులేని సంబంధిత శాఖ**
**-ప్రభుత్వ ధర కంటే అదనంగా రూ 20 నుండి రూ 30**
**-ప్రభుత్వ ఆదేశాల బేఖాతరు**



ప్రజాపక్షం/కారేపల్లి: మండలంలో కల్తీమద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగుతుందనే చర్చ తీవ్ర స్థాయిలో జరుగుతుంది. అదనపు లాభాల కోసం సిండికేట్ దందా ముసుగులో కల్తీ మద్యం అమ్మకాలను సాగిస్తూ మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ మద్యం దందాపై సంబంధిత శాఖ అధికారులకు పట్టింపు లేకపోవడంతో ఈ విధంగా జరుగుతుందనే మాట ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారుతుంది. ఇది మచ్చుకే ఇది చాలాదు అన్నట్లుగా ప్రభుత్వ ధర కంటే అదనంగా క్వార్టర్‌పై రూ 20 నుండి రూ 30 వసూళ్లు చేస్తున్నట్లు మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలైన బ్రాండెడ్ మందు, బీర్లు కేవలం బెల్ట్ షాపుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, వైన్ షాపులలో అడిగితే లేవు అనే మాటను చెప్తున్నారని పలువురు మద్యం ప్రియులు మండిపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మోసం చేస్తూ సాగిస్తున్నా ఈ దందాపై సంబంధిత అధికారులు మాత్రం మౌనం ప్రదర్శించడంలో అంతర్య ఏమిటో అంతుచిక్కని ప్రశ్నగా మారుతోంది. ఈ ఏజెన్సీ ప్రాంతంలో రోజు మొత్తం కూలి పని చేస్తూ కష్టపడి సాయంత్రం అలసిపోయి సమయంలో ఒక క్వార్టర్ మందు కొనుక్కొని తాగి రోజు పడిన కష్టాన్ని మర్చిపోదామని అనుకునే సామాన్య ప్రజల పట్ల ఈ దందా వ్యాపారుల దోపిడితో వారి కష్టం నీటిలో పోసిన పన్నీరు అన్న చందంగా మారుతోంది. వైన్ షాపుల వద్ద బ్రాండెడ్ మందు, బీర్లు లేవని చెప్పడంతో బెల్టు షాపుల వద్ద రూ 30 నుండి 40 అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మద్యం ధరలను అదుపు చేసే వారే కరువు....**

అధిక ధరలను అదుపు చేసే వారే కరువయ్యారని మండలంలోని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా నిలదీసి అడిగితే మా దగ్గర మందు లేదు మేము అమ్మము దిక్కున్న చోట చెప్పుకో అని వైన్స్ యాజమాన్యం ఎదురు దాడికి దిగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సింగరేణి మండలాల సరిహద్దు ప్రాంతమైన అలియాతండా, ఉసిరికాయలపల్లి యువత ఈవిధంగా అదనపు వసూళ్ల దందాపై ఎక్సైజ్ శాఖ అధికారులకు ఎన్నో సార్లు కంప్లైంట్ చేసి పట్టించుకోవడం లేదని , పత్రికలు, మీడియా ద్వారా మా బాధలకు వ్యక్తపరిచిన కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మౌనంగా ఉంటే మద్యం ధరలను అదుపులోకి తీసుకురావడానికి ప్రజలు, మద్యం ప్రియుల నుండి ప్రతికుల సంఘటనలు ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చని పలువురు తెలుపుతున్నారు.

# సిపిఐ డివిజన్ కార్యదర్శిగా కల్లూరి



ప్రజాపక్షం/ఖమ్మం : సిపిఐ డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఈ ఎంపిక చోటు చేసుకుంది. గతంలో రెండు సార్లు డివిజన్ కార్యదర్శిగా చేసిన అనుభవం ఉన్న ఆయన పార్టీ పురోభివృద్ధికి డివిజన్‌లో కృషి చేశారు. ప్రస్తుతం ఆయన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా, గిరిజన సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులుగా కొనసాగుతున్నారు. మరో సారి డివిజన్ పార్టీ బాధ్యతలు పార్టీ నాయకత్వం ఆయనకు అప్పగించింది. ఈ సందర్భంగా కల్లూరి మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సిపిఐని గ్రామగ్రామాన విస్తరింపజేసేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లిఖార్జున రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్, ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ నూరేళ్ల ఉత్సాహం ఉరకలేయాలి

**- కమ్యూనిస్టు పార్టీ అజరామరం**
**- పార్టీ పురోభివృద్ధికి సైనికుల్లా పనిచేద్దాం**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా**






ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి వందేళ్లు అయిన సందర్భంగా ఆ ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతి పరులు పార్టీ పురోభివృద్ధికి సైనికుల్లా ఉరకలేయాలని ఆ పార్జీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 లో భారత కమ్యూనిస్టు పార్టీ పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, కర్షకుల కోసం ఆవిర్భవించిందన్నారు. ఈ నూరేళ్లలో అనేక కష్టాలు, నష్టాలు, ఆటుపోటులు ఎదురయ్యాయని, ఈ సుదీర్ఘ పోరాటంలో ఎన్నో త్యాగాలు ఉన్నాయన్నారు. ఎన్నో పార్టీలు పుట్టుకొచ్చినప్పటికీ ప్రజల పక్షాన నిలబడిన పార్టీ సిపిఐ ఏ అని, పార్టీని లేకుండా చేద్దామని చూసిన వారు కనుమరుగయ్యారని, కానీ నేటికీ ఎర్రజెండా రెపరెపలాడుతూనే ఉందన్నారు. ప్రజలు తిరుగుబాటుతో శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోనికి వచ్చిందని, అదే పరిస్థితి భవిష్యత్‌లో ఇక్కడ రానుందన్నారు. అధికారం కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే సిపిఐకి తిరుగులేదని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడె ంజిల్లాతో పాటు అనేక ప్రాంతాల్లో పోడు భూములకు పట్టాలిచ్చేందుకు పోరాటాలు చేసి నిరుపేదల పక్షాన నిలబడ్డామని చెప్పారు. ప్రజల కోసం జైళ్లు నిర్బంధాలను నాయకులు చవిచూశారని తెలిపారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లవుతున్న సందర్భంగా వాడవాడలో సిపిఐ జెండాలు ఎగరాలని, పార్టీ పోరాటాన్ని, త్యాగాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా నిలదీస్తామని, పోడుపట్టాలు, రైతుబంధు, రైతు రుణమాఫీ వంటి పథకాలు అమలు చేయాలని, లేదంటే పార్టీ పోరాటాలు చేయాల్సి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లిఖార్జున రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లిరవికుమార్, ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, అచంటి ప్రసాద్, నూపపోతయ్య, పాలంచ రామారావు, నూపా తిరుపతి, భద్రాద్రి వెంకటేశ్వరరావు, కిలిమి ఎల్లారెడ్డి, ఎస్‌విఎస్ నాయుడు, కృష్ణ, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం సమీక్ష జరపాలి

**-ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ**
**-శిథిలావస్థకు చేరిన భవనాల పనులు ప్రారంభించాలి**




ప్రజాపక్షం/జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో బుధవారం జరిగిన అఖిల భారత విద్యార్థి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 11 నెలలకు కావస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం బాధాకరమని అన్నారు. విద్యాశాఖ పై కనీసం ఒక్కసారి కూడా ప్రభుత్వం సమీక్ష నిర్వహించకపోవడం రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యమేనన్నారు. ప్రభుత్వం విద్యార్థుల పై సవతి తల్లి ప్రేమ కనబరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు నిలియంగా మారాయని, ఉన్నత అధికారుల పర్యవేక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పాఠశాలలో గదులు లేక, మంచినీటి సౌకర్యం లేక విద్యార్థుల అవస్తలు పడుతుంటే కొన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కూడా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, పేద, మధ్యతరగతి విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్, పునీత్ కుమార్, సాయి తేజ పాల్గొన్నారు.

# శివ ఫ్లెక్సీ ప్రింటింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలం చంద్రుగొండ రోడ్ లో పగడాల అఖిల్ ఏర్పాటుచేసిన శివ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్‌ను బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ రిబ్బన్ కట్ చేసి స్విచ్ ఆన్ చేసి ప్రింట్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూలూరుపాడు, చంద్రుగొండ, ఏన్కూరు పరిసర ప్రాంత ప్రజలుకు జూలూరుపాడు మండల హెడ్ క్వార్టర్ లో ఉన్న శివఫ్లెక్సి ప్రింటింగ్ షాప్ పెట్టడం చాలా సంతోషకరమని, దూర ప్రాంతాలకు వెళ్లకుండానే ఆర్డర్లపై కూడా ఫ్లెక్సీలు తీసుకునే అవకాశం ఉందని, ఫ్లెక్సీ ప్రింటింగ్ మిషన్ ఏర్పాటు చేసినటువంటి పగడాల అఖిల్ కు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ దుద్దుకూరు మధుసూదన్ రావు, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, సిపిఐ సీనియర్ నాయకులు ఎల్లంకి మధు, ఏఐటియుసి మండల కార్యదర్శి ఎస్కె చాంద్ పాషా, కొండా వెంకటేశ్వర్లు, కొండ వీరయ్య తాళ్లూరు లక్ష్మయ్యతో పాటు పరిసర ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసిన భాగం ఫౌండేషన్



ప్రజాపక్షం/ఖమ్మం: ప్రభుత్వ పాఠశాలలోనే అన్ని వసతులతో పాటు, నాణ్యమైన విద్య ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని భాగం ఫౌండేషన్ ఛైర్మన్, ఎన్ఆర్ఐ భాగం రాకేష్ అన్నారు. మండలంలోని బోనకల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్స్‌లను ఎంపిడిఓ రురావత్ రమాదేవి, ఎస్ఐ కండగడ్ల మధుబాబుల చేతులమీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులకు చిన్ననాటి క్రమశిక్షణతో మెలగాలని, చదువులో రాణించాలని కోరారు. నిర్విరామంగా సాగే భాగం ఫౌండేషన్ సేవలను అభినందించారు. ఉపాధ్యాయుల సూచన మేరకు భాగం ఫౌండేషన్ ప్లేట్స్‌లను పంపిణీ చేసినందుకు భాగం రాకేష్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ సభ్యులు రవి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని ఇరవెండిలో తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు, తానా మాజీ అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్, నీలిమ దంపతుల సౌజన్యంతో బుధవారం 12 సైకిళ్లను పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమ శ్రీ కి ఈ సైకిళ్లను అందజేశారు. పాఠశాలకు వచ్చే బాలికలకు ఇబ్బందులు లేకుండా సైకిళ్లు అందించినట్లు ట్రస్ట్ ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీ కృష్ణ, విజయ రేణుక, జగన్మోహన్, వనమా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం



ప్రజాపక్షం/బూర్గంపాడు: మోరంపల్లి బంజర పశువైద్యశాల పరిధిలోని ముసలమడుగు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో గోపాలమిత్ర, గర్భకోష వ్యాధి చికిత్స శిబిరం పశువైద్యులు రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతులు 40 గేదెలను తీసుకురాగా వైద్యులు చూసి పరీక్షలు, గర్భకోశ వ్యాధి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగింది. 30 దూడలకు నట్టల మందు త్రాగించారు. ఈకార్యక్రమానంతరం వైద్యులు రాజేందర్ రైతులకు పాడి పశువుల పెంపకంలో మెలుకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశు గ్రాసాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈకార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్రలు, జాతీయ మానవ జంతు హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధి తాతిరెడ్డి గోవిందరెడ్డి, సిహెచ్ కిరణ్, కె నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి బాలిక అదృశ్యం

ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాకలో గల సెంట్ థెరిస్సా ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బాలిక అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. తాళ్ళగొమ్మూరుకు చెందిన బాలిక సారపాకలోని సెంట్ థెరిస్సా ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతుంది. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో బాలిక తండ్రి పాఠశాలకు తీసుకుని వెళ్లారు. సాయంత్రం 5 గంటలు అయినా బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్కూల్‌కు వెళ్లి తమ కూతురు ఆ చూకీ గురించి ఆరా తీశారు. తమ కూతురుకి రాలేదు అని పాఠశాల యాజమాన్యం చెప్పడంతో, బాలిక అదృశ్యం అయినట్టు కుటుంబ సభ్యులు నిర్ధారించుకుని స్థానిక బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులను వివరణ అడగగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఒంటరి మహిళలకు ఐటిసి బంధన్ సంస్థ చేయూత



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని ఐటిసి బంధన్ సంస్థ వారు నిరుపేద, మహిళా ఆధారిత కుటుంబాలకు కూరగాయల బండి, పండ్ల బండి, కుట్టు మిషన్లు, బట్టల షాప్, ఫ్యాన్సీ షాపులు ఉచితంగానే అందించి చేయూతను ఇస్తున్నారు. ఆ సంస్థ వారు నిర్వహించి ఓ కార్యక్రమంలో ఏపీఎం నాగార్జున, పోస్టల్ శాఖ అధికారి ఆనంద్ రావులు హాజరు అయ్యారు. ఈసందర్భంగా ఏపీఎం నాగార్జున లబ్ధిదారులకు ఎలా అభివృద్ధి చెందుతున్నారనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఐటిసి బంధన్ వారు ఇచ్చిన వ్యాపారాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా డ్వాక్రా గ్రూప్‌ల ద్వారా ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆనంద్‌రావు మాట్లాడుతూ పోస్టల్ శాఖలో అకౌంట్లు తీయడం సంతోషకరమని, ఐటిసి బంధన్ సంస్థ వారిని అభినందించారు. ఇన్సూరెన్స్ గురించి వివరించారు. ఈకార్యక్రమంలో లబ్ధిదారులు, ఐటిసి బంధన్ సంస్థ ఏరియా కోఆర్డినేటర్ ఉత్తమ్ మారజిత్, టీల్, ఉమ్మల సుమన్‌రెడ్డి, సీఓ భూక్యా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్‌లో ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఐసిడిఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ ముసలమడుగు సెక్టార్ పరిధిలో సారపాక పంచాయితీలోని బొగ్గు సురా కాలనీ అంగన్వాడీ సెంటర్ నందు ఘనంగా బాలల దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించి, కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఓ జ్యోతి, సూపర్వైజర్ జగదాంబ పాల్గొని, ఆటల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులను అందించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రచన, మాజీ ఉపసర్పంచ్ పేరాల శ్రీనివాసరావు, సుబ్బారావు, లక్ష్మీ నారాయణ, ఈశ్వరమ్మ, స్వామికుమారి, రాణి, సుజాత, నందిని పాల్గొన్నారు.

# ఆదరించండి.. అభిమానించండి

**-ఆర్భాట కార్యక్రమాలు నిర్వహించకండి**
**-ఉమ్మడి జిల్లా ప్రజలకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర రాజకీయాలలో 40 ఏళ్లుగా కొనసాగుతున్నానని ఇది ప్రజల ఆదరణ, అభిమానంతోనే సాధ్యమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 15న ఎటువంటి ఆర్బాట కార్యక్రమాలు నిర్వహించవద్దని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, తన అభిమానులకు సూచించారు. కేక్‌లు కట్ చేయడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఇతరత్రా ఆర్బాటపు కార్యక్రమాలు చేపట్టవద్దని తెలిపిన తుమ్మల 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తెలుగు ప్రజలు ముఖ్యంగా ఖమ్మంజిల్లా ప్రజలు తన పట్ల ప్రత్యేక అభిమానాన్ని చూపారని వారి అభిమానంతో ఖమ్మంజిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేశానని తుమ్మల ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో కూడా ఖమ్మంజిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, భగవంతుని దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తుమ్మల కోరారు.

# సమగ్ర సర్వేను పరిశీలించిన సిఎంవో అధికారి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి (సిఎంవో) రవిచంద్ర పరిశీలించారు. బుధవారం ఖమ్మంనగర పాలక సంస్థ పరిధిలో సిఎంవో అధికారి రవిచంద్ర పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఎలా పని చేస్తున్నారు, వివరాలు ఎలా సేకరిస్తున్నారు వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్లు ఎలాంటి ఒరిజినల్, జిరాక్స్ పత్రాలను కుటుంబ యజమానుల నుంచి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకున్నా వారికి వీలైన సమయంలో ఎన్యూమరేటర్లు వివరాలు సేకరించాలన్నారు. కుటుంబ యజమానికి సందేహాలను నివృత్తి చేసి ఫాంను పూర్తి చేయాలన్నారు. ఒకే కుటుంబంలో ఎంత మంది ఉన్న వారికి వేర్వేరుగా ఫారాలు నింపాలని తెలిపారు. ఈ సర్వే అభివృద్ధి సంక్షేమ పథకాల కోసం మాత్రమేనని ప్రజలు ఎలాంటి భయాలకు గురి కావద్దని తెలిపారు. సేకరించిన సమాచారం గోప్యంగా ఉంటుందని అధికారులు ఇట్టి సమాచారాన్ని బయటకు ఇవ్వరని ఆయన తెలిపారు. ఈ సర్వేలో కార్పోరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో ఆందోళనలో రైతులు..



**ప్రజాపక్షం/కల్లూరుః** గత రెండు రోజులుగా మసక మబ్బులతో వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి అకాల వర్షం రావడం వలన కల్లాలలో ధాన్యంపై పరదాల కప్పుకొని ఆందోళన పై రైతులు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో కల్లూరు మండలంలో భారీ వర్షం తో రైతులు పుల్లయ్య బంజర, కొర్లగూడెం, కల్లూరు తదితర గ్రామాలలో ఉన్న కల్లూరు టూ మధిర రహదారిపై ధాన్యం రాశులు పోసి వాటిపై పరదాల కప్పుకొని రైతులు జాగ్రత్త పరుచుకున్నారు. ఇప్పటికే 30% మండలంలో వరి కోతలు పూర్తికాగా ఇంకా 70% వరి కోతలు కొన్ని కోసికల్లాలలో మరి కొన్ని కోయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ వర్షానికి మిర్చి తోట ,పత్తి చేలు, దెబ్బ తినే అవకాశం ఉంది. దీనివలన మండలంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న రైతులను అకాల వర్షం వెంటాడుతుంది. మరి కొందరు చేతికొచ్చిన పంట కల్లాలలో మరియు రోడ్లపై ఉండటంతో తడుస్తుందని భయభ్రాంతులకు గురవుతున్నారు. అంతా దేవుని దయ దేవునిపై భారమేసి రైతులు ఉన్నారు.

# అమరుల త్యాగాల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా శేయస్సు కొరకు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరుల స్ఫూర్తితో ముందుకు నడవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సిపిఐ మండల కార్యదర్శి యంగళ ఆనందరావుతో కలిసి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..100 సంవత్సరాల కాలంలో భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో మార్పులను తీసుకువచ్చిందని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో బానిస విముక్తి కొరకు సాయుధ పోరాటాన్ని నిర్వహించిన ఘనమైన చరిత్ర సిపిఐ పార్టీకే ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన అప్పటి వరంగల్ జిల్లాలో భాగమైన మధిర తాలుకాలో పార్టీకి ఇప్పటికీ అదరణ ఉందని అన్నారు. త్యాగధనులు, అమరులు వారి సర్వసాన్ని,ప్రాణాలను సైతం సిపిఐ కోసం త్యాగం చేశారని అన్నారు. ఆళ్లపాడు గ్రామ అభివృద్ధిలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో ఎందరో వీరులను అందించిన గడ్డ ఆళ్లపాడు అని కొనియాడారు. ప్రజాశ్రేయస్సు కోసం బావులు తవ్వించడం, చెరువుల్ని పరిరక్షించడం, పేదలకు భూములను పంచడం వంటి కార్యక్రమాలను సిపిఐ శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుత సిపిఐలోని యువత గత చరిత్రను తెలుసుకోవాలని, వారి ఆశయాలను కాపాడాలని, సిపిఐ బలపేతానికి కృషి చేయాలని కోరారు. సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బెజవాడ నరేష్, సీనియర్ నాయకులు బుంగ నరసింహ, సిపిఐ యూత్ నాయకులు బుంగ గోపి, బుంగ సాయి, మల్లాది ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో సత్తా చాటిన మాంట్ ఫోర్ట్ విద్యార్థులు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో మాంట్ ఫోర్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ బ్రదర్ జాన్‌పాల్ తెలిపారు. ఇటీవల విజయవాడలో ఎన్ఎస్ఎం స్కూల్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఖమ్మం మాంట్ ఫోర్ట్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత పోటీ డిస్కస్ త్రో విభాగంలో పదవ తరగతి విద్యార్థి డి. ఉమామహేష్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతాకం సాధించారు. ఖోఖోలో మాంట్ ఫోర్ట్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాన్ని సాధించారు. ఈ పోటీలకు విజయవాడ శాసన సభ్యులు గద్దె రాంమోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పతాకాలు సాధించిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బ్రదర్ జాన్‌పాల్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జోష్, ఉపాధ్యాయులు అభినందించారు.

# గ్రూప్ 3 పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నవంబర్ 17 నుండి 18 వరకు జరిగే గ్రూప్ 3 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 17 నుండి 18 వరకు పరీక్షా కేంద్రాలలో నిర్వహించే గ్రూప్ 3 పరీక్షల సందర్భంగా నవంబర్ 17 ఉదయం ఆరు గంటల నుంచి నవంబర్ 18 సాయంత్రం ఆరు గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని సిపి తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజెలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని తెలిపారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్‌లు, జిరాక్స్ షాపులు, స్టేషనరి దుకాణాలు మూసివేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సిపి తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిపి తెలిపారు.

# గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంయుక్త కార్యదర్శిగా రాంబాబు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన గాలి రాంబాబు నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఛైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి రాంబాబుకు నియామకపు పత్రాన్ని అందజేశారు. గాంధీ సూచించిన సుస్థిర లక్ష్యాలైన విద్య, వైద్యం, పర్యావరణంపై గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత విస్తృత పర్చాలని రాజేందర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని గాంధీ గ్లోబల్ కార్యక్రమాన్ని విస్తృత పర్చడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెరుగు మధు, ఎడ్ల సురేందర్ యాదవ్, గూడూరు మధన్‌మోహన్, సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మంచుకొండ సొసైటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కెవి బంజర గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపివో శ్రీనివాసరెడ్డి, సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఏఈవో వేదవ్యాస్ సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకు రావాలని తెలిపారు. 17 శాతంలోపు తేమ ఉంటే ప్రభుత్వమద్దతు ధర లభిస్తుందని ఆయన తెలిపారు. సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ. 500 ప్రభుత్వం బోనస్ అందిస్తుందని తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరతో పాటు సన్న రకానికి రూ. 500 బోనస్ పొందాలని తెలిపారు.

# గ్రూప్ 3 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్ 3 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో గ్రూప్ 3 పరీక్ష నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 17,18 తేదీలలో పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. అభ్యర్థులను కేంద్రంలోనికి అనుమతించే ముందు తనిఖీలు చేయాలని, సిసి కెమేరాలు., తాగునీరు, విద్యుత్ సదుపాయం ఉండేలా చూడాలని చెప్పారు. సమయానుకూలంగా ఆర్‌టిసి బస్సులను నడిపించాలని ఆదేశించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లతో పాటు ఏఎన్ఎంలను నియమించాలని, పరీక్షా కేంద్రాల్లో షానిటేషన్ నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు నడవకుండా చూడాలని, సెల్‌ఫోన్లు అనుమతించరాదని, బయటి వ్యక్తులు, మీడియా ప్రతినిధులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరాదన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే లోనికి ప్రవేశించాలని, వాచీలు బంగారు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. అనంతరం సిబ్బందికి పరీక్ష సమాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి సత్యనారాయణ, గ్రూప్ 3 పరీక్షల కో ఆర్డినేటర్ హరికృష్ణ, జిలాల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్కాడ్‌లు, అబ్జర్వర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శిగా సంపత్‌కుమార్

**ప్రజాపక్షం/ఖమ్మంః** పాల్వంచ మండలంలో ఉన్న సిఆర్ భవన్ నందు జరిగిన గిరిజన సమాఖ్య తృతీయ మహాసభల నందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మూడు సంపత్‌కుమార్‌ను తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శిగాఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా బాధ్యతలుఅప్పగించిన తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకత్వానికి కొత్తగూడెం శాసనసభ్యులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సిపిఐ జిల్లా క్యావర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పత్తి రైతులకు ఇబ్బందులు : దొండపాటి



**ప్రజాపక్షం/వైరా:** అనేక కష్టనష్టాలతో దిగుబడి తగ్గి చేతికొచ్చిన పత్తి పంటలను సిసిఐ ద్వారా కొనుగోలు కేంద్రాఏ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన పత్తి రైతులు దళారీల చేతిలో నలిగిపోతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్‌కుమార్‌లు ఆరోపించారు. బుధవారం ఏన్కూరు పత్తిమార్కెట్‌లో సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పరిస్థితులు చూసి పత్తి మార్కెట్‌లో ళారీల మార్కెట్‌గా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు కుమ్మక్కై రైతుల పత్తిని రూ.6వేలకు కొనుగోలు చేసి రైతులను మోసం చేయడం చాలా బాధాకరమని అన్నారు. ఏన్కూరు ప్రాంతంలో ప్రతి జిన్నింగ్ మిల్లు ఏర్పాటుకు ప్రభుత్వం కృషిచేయాలని ఏన్కూరు మార్కెట్‌లో పత్తి కొనుగోలు కోసం సిసిఐ కేంద్రం ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో వే బ్రిడ్జి రిపేర్‌లో ఉండి ఉపయోగం లేకపోవడం వలన ప్రైవేటు వే బ్రిడ్జిలను రైతులు ఆదరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌లో వేబ్రిడ్జిని తక్షణమే రిపేర్ చేయించి రైతులు అందుబాటులో కావాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కావాల్సిన కనీస సౌకర్యాలను కల్పించి తక్షణమే మార్కెట్‌లో రైతులకు మేలుకు జరిగే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు అమరనేని వీరభద్రం, తాళ్లూరి రమణ, మాదినేని వెంకన్న, రాచబండి ఎల్లయ్య, రమేష్, కొత్తపల్లి బసవయ్య, వెంకన్న, ఆనంద్ తదితరులుపాల్గొన్నారు.

# జోనల్ క్రీడలు ముగింపు కార్యక్రమంలో పాల్గొననున్న డిప్యూటీ సిఎం భట్టి



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం వైరాలో గత మూడు రోజులుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్న సంక్షేమ గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ గురువారం ముగియనుంది. మూడోరోజు పోటీపోటీగా జరిగిన పలు గేమ్స్, స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో పలువురు విద్యార్థులు గెలుపును అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత తెలిపారు. లాంగ్‌జంప్, హైజంప్, 400 రిలే రన్నింగ్, క్యారమ్స్, చదరంగం తదితర క్రీడాంశాల్లో విద్యార్థులు నువ్వానేనా అన్నట్లు తలపడి ఫైనల్స్‌కు చేరుకున్నట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఓవరాల్ ఇంచార్జి కె.శ్రీదేవి వెల్లడించారు. సీనియర్ ప్రిన్సిపాల్ జ్యోతి, పివి.పద్మావతి, ఎం.పద్మావతి, లిల్లీ, మైథిఇ, గంటేల సుజాత, ఐనాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

**3వ రోజు విజేతల వివరాలు...**

అండర్14 విభాగంలో డిస్కస్ త్రో పోటీలో ప్రథమ,ద్వితీయ, బహుమతులు వరరుసగా పి.కీర్తి(నేలకొండపల్లి), పి.సుప్రియ(ఇల్లందు, ఆర్.ప్రశాంతి(పాల్వంచ)హైజంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుంతులు వరుసగా జి.శ్రీహర్షిని(ఇల్లందు), బి.వైష్ణవి(ఇల్లందు), రేష్మా(వైరా)400 మీటర్స్ పరుగు పందెంప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఎస్.భార్గవి(వైరా), జి.మంజని(కల్లూరు), మహాలక్ష్మి(ఇల్లందు)600మీటర్ల పరుగు పందెంప్రథమ, ద్వితీయ స్థానాలు వరుసగా టి.రెసోనా(వైరా), పి.స్రవంతి(కల్లూరు), జి.మంజుని(కల్లూరు)టెన్నికాయిట్ పోటీల్లో ప్రథమస్థానం దానవాయిగూడెం ద్వితీయ స్థానం వైరా చదరంగం పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా జి.హర్షిత(అడవిమల్లెల), ఎన్.షణ్ముఖ(ఎర్రుపాలెం), జె.శ్రీకల(నేలకొండపల్లి)క్యారమ్స్ డబుల్స్‌లోప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరరుసగా టి.దైవన్య–విద్యశ్రీ(నేలకొండపలి, ఆర్.స్వర్ణ–మనస్విశ్రీ జోష్ణ(కూసుమంచి), జి.వెన్నెల–బి.ఉదయశ్రీ(టేకులపల్లి)ఓవరాల్ ఇంచార్జి కె.శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం అండర్ 14,17,19 విభాగాల్లో ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ రోజు జరిగిన ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంలో బోస్, శ్రీలత, రంగారావు, రామ్మోహన్, టి.సాయికిరణ్, సంజీవరెడ్డి, రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంక్షేమానికి రూ.200కోట్లు కేటాయించాలి



**- మధిరలో ఐఎఎల్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ**

**ప్రజాపక్షం/ మధిర:** న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.200 కోట్లు కేటాయించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎఎల్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు షేక్.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధిర కోర్టు ప్రాంగణంలో నవంబర్ 30, డిసెంబర్ 1వ తేదీల్లో హన్మకొండలో జరుగనున్న ఐఎఎల్ రాష్ట్ర రెండవ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా న్యాయవాదుల సంక్షేమానికి ఇచ్చే రూ.100కోట్లు ప్రభుత్వం విడుదల చేయటం లేదన్నారు. న్యాయవాదుల సంఖ్య రోజురోజుకి పెరుగుతున్నందున న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.200 కోట్లు విడుదల చేయాలన్నారు. అదేవిధంగా న్యాయవాదులకు జీవిత బీమా, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెల రూ.5000 ఆసరా మూడు సంవత్సరాల వరకు ఇవ్వాలన్నారు. ఐఎఎల్ రాష్ట్ర మహాసభలకు న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ జిల్లా సహాయ కార్యదర్శి కొలికొండ శరత్‌బాబు, ఉపాధ్యక్షులు తేలప్రోలు వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన అధికారులు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే ( సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) తో పాటు సహకార ఐకెపి కేంద్రాల ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాలను తిరుమలాయపాలెం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బుధవారం తహసిల్దార్ పి.వి రామకృష్ణ, ఎంపీడీవో ఎస్ కె సిలార్ సాహెబ్ సందర్శించి పరిశీలించారు. బిరోలు, జూపెడ, సుబ్లేడు గ్రామాలలోని కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వద్దన్నారు.కుటుంబ యజమాని తెలిపిన మేరకు పూర్తి సమాచారంతో సర్వేలో ఆ కుటుంబ వివరాలను పొందుపరచాలన్నారు. ఒక కుటుంబ సర్వే పూర్తయిన వెంటనే ఆ ఇంటి గోడ పైన స్టిక్కర్ అతికించాలని సూచించారు. ప్రజలు కూడా సర్వే సిబ్బందికి సహకరించి స్పష్టంగా తమ కుటుంబ వివరాలను అందజేయాలని కోరారు. అలాగే వరి కొనుగోలు కేంద్రాన్నిలాను కూడా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం వరి ధాన్యం తేమశాతం 17 లోపు ఉండాలని, సన్న రకం దాన్యం 6 మిల్లీమీటర్ పొడవు, రెండు మిల్లీ మీటర్ల అడ్డం ఉండాలని సూచించారు. అలాగే రాజారంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పిఎంజిఎస్వై) నిధుల ద్వారా మంజూరైన ప్రధాన రహదారిని పరిశీలించి, గోల్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గాయత్రి జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి పత్తి కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి అవకతవకులు జరగకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాఘవయ్య, ఐకెపిసిసి అనిత గ్రామ దీపికలు తదితరులు పాల్గొన్నారు.

# నాస్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించాలి




**ప్రజాపక్షం/ మధిర :** జాతీయస్థాయిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డిసెంబర్ 4న నిర్వహించనున్న నేషనల్ అచీవ్మెంట్ సర్వే(నాస్) పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించి విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్ కోరారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన మధిర మండల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో నాస్ పరీక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సమాయత్తం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నాస్ పరీక్షకు 3వ, 6వ, 9వ తరగతుల విద్యార్థులను వారికి కేటాయించిన సిలబస్ ప్రకారం ప్రత్యేక తర్ఫీదు అందిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ మెరుగైన ఫలితాలు తీసుకుని రావాలని కోరారు. అనంతరం ప్రశ్న పత్రంలోని సమస్యల సరళిపై రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించిన జమీర్, శ్రీనివాస్‌లు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సిరిపురం, హరిజనవాడ కాంపెక్స్ హెచ్‌ఎంలు మురళీమోహన్, విజయశ్రీ, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు సిఆర్పిలు పాల్గొన్నారు.

# స్మశాన వాటికలో బోరు ఏర్పాటు



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధి లోని రాయపట్నం దళిత స్మశాన వాటికలో బుధవారం నూతనంగా మంచి నీటి బోరును ఏర్పాటు చేశారు. స్మశాన వాటికలో గత ఎనిమిదేళ్లుగా చేతిపంపు పనిచేయకపోవటంతో గ్రామంలోని దళితులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. దళితుల్లో ఎవరైనా చనిపోయిన సందర్భాల్లో అలాగే సంస్మరణ దినం రోజున స్మశానవాటికలో నీళ్లు లేక డ్రమ్ములతో, బిందెలతో, నీటి ట్యాంకర్ ద్వారా ఆరోజు అవసరాన్ని గట్టెక్కిస్తున్నారు. ఈ సమస్యను డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు దృష్టికి కాంగ్రెస్ నాయకులు అల్లాడి గోపాలరావు, కోట రవిచంద్ర, భూపాల్ తదితరులు తీసుకు వెళ్లగా వెంటనే స్పందించిన భట్టి బోరు ఏర్పాటుకు సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో స్మశానవాటికలో నూతన బోరును ఏర్పాటు చేయటంతో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు గ్రామ దళితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.నరేష్, గ్రామ కాంగ్రెస్ నాయకులు నాగభూషణం, గోళ్ల ఉద్దండు, మార్నిడి పుల్లారావు, జిల్లేపల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా టిడిపి సభ్యత్వ నమోదు





**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పార్టీ బాధ్యుడు దేవభక్తిని వెంకట్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకుడు చేకూరి శేఖర్‌బాబు సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కీలకమని, పార్టీ సంస్థాగతంగా బలపడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. గతంలో సభ్యులు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణాపురంలో పలువురు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోగా మరికొంతమంది నూతనంగా సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కర్నాటి వీరభద్రరావు, లింగయ్య, తాతిన రాంబాబు, చెరుకూరి వెంకట్రావు, కర్నాటి శ్రీనివాసరావు, మేడా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ నూరేళ్ల వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) నూరు సంవత్సరాల వార్షికోత్సవాలను తల్లాడ మండలంలో ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా నేత మద్దోజు శ్రావణ్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తల్లాడ మండలంలోని పెనుపాక గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భవించి నూరు సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా తల్లాడ మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన ఎర్రజెండా ఎగురవేయాలని అన్నారు. సిపిఐ గ్రామశాఖలు ఏర్పాటు చేసి బడుగు, బలహీన, పేదల అభ్యున్నతి కోసం పోరాటం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే వరకు సిపిఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాలను విస్మరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ జిల్లా సమితి సభ్యులు నల్లమోతు నర్సింహారావు, సిపిఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్, డిహెచ్‌పిఎస్ మండల కన్వీనర్ రాయప్ప, నాయకులు పటాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు విడుదలపై ఎమ్మెల్యే అధికారులతో రైతులతో సమీక్ష





**ప్రజాపక్షం/వైరాః** వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోవైరా ప్రాజెక్ట్ క్రింద రబీ సీజన్‌లో రైతులు వివిధ పంటలు సాగు చేసుకోవడం కోసం రిజర్వాయర్ నుండి నీటి విడుదల కొరకు మంగళవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఇరిగేషన్ ఈఈ బాబురావు, డిఈ శ్రీనివాస్, ఏడిఏ కరుణ, ఏవో మంజుఖాన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుపువ్వాళ్ళ దుర్గాప్రసాద్, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రారాజశేఖర్, పిసిసి కార్యదర్శికట్ల రంగారావు, రైతు సంఘం, రైతు సంఘాల నాయకులు బొంతు రాంబాబుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి విడుదలపై అధికారులు సూచనలు, రైతుల సూచనలు తీసుకున్నారు. రైతులు నీరును పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుదని రాందాస్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, దొడ్డా పుల్లయ్య, దాసరి దానియేలు, మందడపు మదుసూదన్‌రావు, యామాల గోపాలరావు, కంకణాల అరర్జున్‌రావు, నాయకులు మచ్చా బుజ్జి, మట్టూరు వెంకటేశ్వరరావు, బోళ్ళ గంగారావు, పొదిలి హరినాథ్, పల్లపు కొండలు, ఫణితి శ్రీను, చింతనిప్పు మురళి, బిడికెరత్నం, రాంపూడి రోశయ్య, మట్టూరు నాగేశ్వరరావు, మట్టూరి కృష్ణారావు, నర్వనేని అశోక్, శీలం సురేందర్‌రెడ్డి, కన్నెగంటి నాగేశ్వరరావు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, గుత్తా రామారావు, సూర్యదేవర శ్రీధర్, కర్నాటి హనుమంతరావు, కొల్లి రమేష్, ఆది ఆనందరావు, నర్వనేని గోపాలరావు, పాలేటి నర్సింహారావు, తేలూరి వీరయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి పౌరులైన నేటి బాలలతోనే దేశ భవిష్యత్



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** రేపటి పౌరులైన నేటి బాలల పనితీరుతోనే దేశ భవిత ఆదారపడి ఉంటుందన్నారు విద్యాశాఖాధికారి నక్కా రాజేశ్వర రావు.పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో బుధవారం బాల దినోత్సవ్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఈఓ నక్కా.రాజేశ్వరరావు హజరైనారు. మొదటి రోజు కార్యక్రమంలో బాగంగా విద్యార్ధులకు టాలెంట్ టెస్ట్,వేమన పద్యాలు,కూచిపూడి నృత్యంలో ప్రతిభ చూపిన విద్యార్ధులకు రాజేశ్వరరావు బహుమతులు అందజేశారు.అనంతరం పసుపులేటి నాగేశ్వరరావు అద్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్ధులు క్రమశిక్షణ,సమయపాలన పాటిస్తూ, వినయ విదేయతలతో విద్యనభ్యసించడం ద్వారా ఉన్నత స్థితికి చేరవచ్చని,తల్లిదండ్రులు,ఉపాద్యాయులను గౌరవిస్తూ జ్ఞానసముపార్జన చేయాలని విద్యార్ధులకు సూచించారు.ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలపై దృష్టిపెట్టాలని కోరారు.చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉపాద్యాయులను,తల్లిదండ్రులను గౌరవించటం నేర్చుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నరుకుల సత్యనారాయణ, ఉపాద్యాయులు విద్యార్ధులు పాల్గొన్నారు.

# నూరేళ్ళ జీవితాన్ని మత్తులో ముంచకండి

**మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో సిఐ సతీష్ కుమార్**



**ప్రజాపక్షం/మణుగూరు రూరల్ :** మణుగూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో మాదకద్రవ్యాలను నిర్మూలించాలని బుధవారం విద్యార్థులచే భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవిస్తూ యువతీ యువకులు ముఖ్యంగా విద్యార్థులు తమ జీవితాన్ని ఆదిలోనే అంతం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆశలు అడియాశలు చేస్తూ వారు కన్న కలలన్నీ కలలుగానే మిగిలిపోయేట్లు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, ఉన్నత చదువులు చదువుకొని, గురువులకు, కన్న తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలు సేవిస్తున్న విద్యార్థులలో ఎక్కువ శాతం ఉన్నత చదువులు చదివే విద్యార్థులు ఉండడం బాధాకరమైన విషయమన్నారు. ఉద్యోగాలు చేస్తూ తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన బాధ్యత విద్యార్థులకు ఎంతైనా ఉందని తెలిపారు. మండలంలో మాదకద్రవ్యాలు సేవించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో విద్యార్థుల చేత మానవహారం నిర్వహించి, మాదక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత.. నూరేళ్ల జీవితాన్ని మత్తులో ముంచకు.. కుటుంబాన్ని రోడ్డున పడేయకు.. అనే విద్యార్థుల నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో సిఐ సతీష్ కుమార్, ఎస్సైలు మేడా ప్రసాద్, రంజిత్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అధికారుల బాధ్యతారాహిత్యం

**-రూ.1.50 లక్షల రికవరీ**

**-మస్టర్లో ఎఫ్ఏ సంతకాలు లేకుండా 42.50లక్షల పేమెంట్**



**ప్రజాపక్షం-చింతకాని :** చింతకాని మండల ఉపాధిహామీ పథకంలో అధికారుల భాధ్యతారాహిత్యంతో సామాజిక తనిఖీలో రూ.1.50లక్షల రికవరీకి ఆదేశించారు.జాతీయ ఉపాధిహామీ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. మండల వ్యాప్తంగా 26 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో మొత్తం 704 పనులకు గాను 5.61 కోట్ల రూపాయల పనులు చేయగా అధికారలు నిర్లక్ష్యం వహించినందుకు జరిమానా 42వేలు,అవకతవకలకు గాను రికవరీ 60,825 పంచాయతీరాజ్ కింద 131 పనులకు4.22 కోట్ల విలువ పనులు చేయగా అవకతవకలకు గాను 9,481 రూపాయలు రికవరీ చేశామన్నారు. ఫారెస్ట్ నర్సరీ కి సంబంధించి 2019 రికార్డుల్లో 43,776 రికవరీ కి ఆదేశించారు.అప్పటి ఎఫ్ఆర్వో సీడ్స్ కొనుగోలు పేరుతో తన స్వంత ఖాతాలో 39,061జమచేసుకోవడంతో వాటిని రికవరీకి ఆదేశించారు. మన ఊరు మన బడి కి సంబంధించి 15 పనులకు గాను71.18 లక్షల పనులు జరగగా అట్టి రికార్డులను సామజిక తనిఖీ బృందానికి ఇవ్వకపోవడంతో అధికారులు తనిఖీ చేయలేదన్నారు. నాగులవంచలో ఒకరికి బదులు మరొకరు పనులు చేశారని గుర్తించారు. నాగులవంచలో 42.50 లక్షల పనులకు గాను ఫీల్డ్ అసిస్టెంట్ సంతకాలు లేకుండా పేమెంట్ చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది.ఉపాధి అధికారుల భాధ్యతారాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి,ఉపాధి హామీ సిబ్బందికి జరిమానా విధించారు.ఉదయం 10గంటలకు ప్రారంభమైన బహిరంగ చర్చావేదిక రాత్రి 8 గంటల వరకు సాగింది.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో అదనపు పీడీ బి.శిరీష, ఏపీడీ చుంచు శ్రీనివాసరావు,ఎంపీడీవో రామయ్య,డీవివివో సక్రియా,క్వాలిటీ కంట్రోల్ సీడీవో వీరయ్య,అంబుడ్స్‌మెన్ రమేష్ బాబు,ఉపాధిహామీ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వైరా చెరువులో రొయ్య పిల్లలను వదిలిన మత్స్య కార్మిక సంఘ సభ్యులు



**ప్రజాపక్షం/వైరాః** వైరా చెరువులో మత్స్య కార్మిక సంఘ పాలకవర సభ్యులు సమక్షంలో సంఘ సభ్యులు మంగళవారం రొయ్య పిల్లలు ఆరువేల లీటర్లు వదిలారు. ఈ సందర్భంగా మత్స్య కార్మిక సంఘం సభ్యులు చెరువు వద్దకు చేరుకొని అక్కడ పూజలు నిర్వహించి రొయ్య పిల్లలను వదలడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రహీం మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరం కలిసి రొయ్య పిల్లలు వదలడం జరిగిందని, మత్స్యకారుల అభివృద్ధికోసంకార్మికుల అందరం కలిసి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వ సహాయం కూడా కార్మికులకు అందేవిధంగా కృషిచేస్తానని రహీం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్య కార్మిక సభ్యులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న గురుకుల జోనల్ మీట్ క్రీడలు



**ప్రజాపక్షం/వైరాః** గత మూడు రోజులుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్న సంక్షేమ గురకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ నేటితో ముగియనుంది. మూడో రోజుపోటాపోటీగా జరిగిన పలు గేమ్స్, స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో పలువురు విద్యార్థులు గెలుపును అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత తెలిపారు. లాంగ్‌జంప్, హై జంప్, 400 రిలే క్యారమ్స్, చదరంగం, తదితర క్రీడాంశాలలో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు తలపడి ఫైనల్స్ చేరుకున్నట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఓవరాల్ ఇంచార్జి కె.శ్రీదేవి వెల్లడించారు. సాయంత్రం జరిగినప్రత్యేక సమావేశంలో వైరా తహశీల్దార్ కెవి.శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా వైరా కళాశాల విద్యార్థిని నృత్యం అలరించింది. ఈ సందర్భంగా తహశీల్దార్ చిన్నారి నాగసుష్మ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపిసికి నగదు బహుమతిని అందజేశారు.

# కాల్వను బాగుచేసుకుందాం



**ప్రజాపక్షం-చింతకాని :** తూటికుంట్ల మేజర్ కాలువ పూడికతో నిండిపోవడంతో నీరు రాక నాగిలిగొండ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక రైతులు ముందుకువచ్చి తమ స్వంత ఖర్చులతోనే పూడికతీసే పనులు చేపట్టారు. బుధవారం నాగిలిగొండ వద్ద రైతు సంఘం నాయకులు ఏపూరి రవీంద్రబాబు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డం చిన్న శ్రీను, మాజీ సర్పంచ్ చాట్ల సురేష్,వేముల నరసయ్య,కొండర రామారావు,పంది చిన్న కృష్ణయ్య,మద్దిన్ని బసవయ్య,భూపతి తదితరులు పాల్గొన్నారు.

# రాయిపాడు గ్రామంలో పశు వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల పరిధిలోని అనంతోగు గ్రామ పంచాయితీలో గల రాయిపాడు గ్రామంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో గల పశుగణాభివృద్ధి సంస్థ బుధవారం పశువైద్యాధికారి వివేక్, మాజీ ఎంపీపీ పెనగట్ల పాపారావు, గోపాల మిత్ర కేంద్రంతో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు, నట్టల నివారణకు మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పశువైద్యాధికారి సురేష్, గోపాల మిత్ర సూపర్వైజర్ సాయి ప్రకాష్, సుధాకర్, నాగేశ్వరరావు, గణేష్, కార్యదర్శి వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**-అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి**



**ప్రజాపక్షం/కూసుమంచి :** ధాన్య కొనుగోళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ కూసుమంచి మండలం పాలేరు లో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, ధాన్య కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సరైన తేమ శాతంతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి పంపించాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. కేంద్ర పరిధిలో కోతలు ఎప్పుడు పూర్తవుతాయని? రైతులు ప్రైవేటు మిల్లులు, కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువెళ్తున్నారా? ఈ ప్రాంతంలో ఏ రకం ధాన్యం ఎక్కువగా పండుతున్నదని ? అడిగి తెలుసుకున్నారు. చెత్త, తాలు లేకుండా, శుభ్రంగా ఆరబెట్టి తూర్పార బట్టి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కొనుగోలు ధాన్యాన్ని 24 గంటల లోపు సంబంధిత మిల్లుకు రవాణా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, అధికారులు తదితరులు ఉన్నారు.